క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

సారంగాపూర్: మండలంలోని కౌట్ల(బి) నుంచి స్వర్ణ గ్రామంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి విద్యుత్ లైన్ ఏర్పాటుతో ఆయా చోట్ల ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఖానాపూర్: వార్షిక పరీక్షలను పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటిపరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ వంశీమాధవ్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులు డా.ఇద్రిచ్ అక్బాని, అప్మాలిక్ సహాయ అధికారి రాంరెడ్డి, ఆర్‌బీఎస్‌కే డా.నాగరాజు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు.

'పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు'



ఇంటి గేటు తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఇంటి పన్ను చెల్లించని యజమానుల ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ ఆర్వో అనూప్‌కుమార్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీలో ఇంటిపన్ను చెల్లించని ఇంటి గేట్లను తీసుకెళ్లారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి నిర్మల్ పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అనిత

తానూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. శనివారం తానూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారుల పోషకులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వందన, శోభ తదితరులు పాల్గొన్నారు.

వెదురు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ముధోల్: మండలంలోని చించాల పంచాయతీ పరిధిలోని పిప్రి గ్రామంలో శనివారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో వెదురు కర్రలకు వేలం వేసినట్లుడీఏవో అంజిప్రసాద్ తెలిపారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా 100 కర్రలకు రూ.3065 చొప్పున భైంసాకు చెందిన కె.విశ్వనాథ్ వెదురు వనాన్ని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఎంపీవో పర్యటించి మాట్లాడారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులు పరిశీలించి పారిశుద్ధ్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్‌షెడ్డు, వైకుంఠధామం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హనుమంతు, కారోబార్ రాజు తదితరులు ఉన్నారు.

ఆలయంపై పట్టింపేది?

- ఆనవాళ్లు కోల్పోతున్న శిల్పసంపద
- భక్తులు పెరుగుతున్నా.. సౌకర్యాలు కల్పించని వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శిథిలావస్థకు చిన్న ఆలయం

భైంసారూరల్: ఆధ్యాత్మికతకు నిలయమైన జిల్లాలో వందల ఏళ్ల చరిత్ర కల్గిన పురాతన ఆలయాల రక్షణను అధికారులు, పాలకులు విస్మరిస్తుండటంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. మనం ఎలాంటి చర్యలు చేపట్టకుంటే ఎంతో ప్రాధాన్యం కల్గిన ఈ ఆలయాల గొప్పతనం భావితరాలకు తెలియకుండా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ అధికారులు స్పందించి మారుమూల గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాల రక్షణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలంటున్న ప్రజలు..

భైంసా పట్టణ పరిధిలోని కట్ట మహాదేవుడి మందిరం, లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గోదావరి నదీ ఒడ్డున బ్రహ్మేశ్వర ఆలయం, భైంసా మండలంలోని చుచుంద్ గ్రామంలో సిద్ధేశ్వర ఆలయాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ ఆలయాల్లో రాతిస్తంభాలతో నిర్మించిన



పర్యవేక్షణ లేక మట్టిలో కూరుకుపోతున్న విగ్రహాలు

కట్టడాలు, శిల్పాలు దెబ్బతింటున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీలు, భక్తులు, పలువురు దాతలు ముందుకొచ్చి దెబ్బతింటున్న ఆలయాలకు మరమ్మతులు చేయించి పూజలు నిర్వహిస్తున్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ చరిత్ర ఇది..

ఒకప్పుడు మహారాష్ట్ర నుంచి భైంసా పట్టణం వైపు సుద్దవాగు ప్రవహించేది. వాగుకు సమీపంలో గ్రామానికి ఆనుకుని వేల ఏళ్ల కిందట సిద్ధేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. రాతి స్తంభాలతో కట్టిన ఈ గుడి చుట్టూ అప్పటి రాజులు గణపతి, నాగరాజు, శివలింగాలు ఇలా దేవతామూర్తులను విగ్రహాలుగా చెక్కించారు. కాశీ సమీప ప్రాంతంలోని యోగులు, మునులు వచ్చి ఇక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారని గ్రామస్తులు చెబుతుంటారు. తాళ్ల సాయంతో వాగులోంచి నీటిని దాటుకుంటూ వచ్చి స్వామివారిని దర్శించుకునేవారు.

ప్రాజెక్టు ముంపుతో...

2001లో భైంసా పట్టణ సమీపంలో సుద్దవాగు గడ్డెన్నవాగు ప్రాజెక్టును నిర్మించారు. భైంసా పట్టణవాసులకు తాగునీరు, భైంసా, లోకేశ్వరం మండలాల్లోని 14వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును నిర్మించి గడ్డెన్నవాగు ప్రాజెక్టుగా నామకరణం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో చుచుంద్ గ్రామం పూర్తిగా ముంపునకు గురైంది. చుచుంద్ గ్రామానికి పక్కనే పునరావాసం కల్పించారు. ప్రాజెక్టు నీరు ఉండటంతో ఈ ఊరు ఎప్పుడు నీటిలోనే మునిగి ఉంటుంది. కేవలం పండుగలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాల సమయంలో మాత్రమే ఆలయానికి వెళ్లి



చుచుంద్‌లో దీపారాధన స్తంభాలతో సిద్ధేశ్వరస్వామి ఆలయం

పూజలు చేస్తున్నారు. చుచుంద్ గ్రామంలోని సిద్ధేశ్వర ఆలయానికి వెళ్లగానే రెండువైపులా రాతిస్తంభాలు ఉంటాయి. ఈ స్తంభాలు ఎక్కేందుకు బయట నుంచి మెట్లను పోలిన బండలు కనిపిస్తాయి. ఈ స్తంభాలు ఎక్కి రోజు దీపాలు వెలిగించేవారు. యువకులు, రైతులు స్వామి కీర్తనలు ఆలపిస్తూ ఉండేవారు. రాతిస్తంభంపై వెలిగించిన దీపాల వెలుగులతోనే ఇక్కడి వారు రాత్రి బడుల్లో చదువులు నేర్చుకున్నారు. క్రమేణా ఈస్తంభాలకు ఉన్న బండలు కూలుతున్నాయి. చరిత్రకు సాక్ష్యంగా మిగిలిన ఈ దీపారాదన స్తంభాలను వెలిగేలా చూడాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



బాధితులకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే బొజ్జు

పెంబి: మండలంలోని రాయదారి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరుగగా.. ఇల్లు కాలి సర్వం కోల్పోయిన బాధితులను శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పరామర్శించారు. అధైర్యపడొద్దని.. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మూడు కుటుంబాలకు రూ.పది వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. నాగాపూర్ గ్రామానికి చెందిన కౌలురైతు మైసయ్య విద్యుత్ షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.పది వేలను ఆర్థికసాయంగా అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, మహేందర్, శంకర్ ఉన్నారు.

సాయం అందించిన జాన్సన్‌నాయక్

పెంబి: మండలంలోని రాయదారిలో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గోవింద్, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఆజాద్ స్మారక క్లాక్ టవర్ నిర్మాణానికి కృషి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక క్లాక్ టవర్ నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు భరోసా ఇచ్చారు. శనివారం పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌరస్తాలో కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ 66వ వర్ధంతి నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి మాట్లాడుతూ సొసైటీ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, మహమ్మద్ మతిన్, సబకలీం,అహెతేశ్యాం అలీ, సొసైటీ వ్యవస్థాపకుడు, జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా, పట్టణాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్ బిన్ అలీ, షేక్ ఇంతియాజ్, షేక్ షాదుల్లా హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

కాంగ్రెస్ వైపే పట్టభద్రులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టభద్రులు కాంగ్రెస్ వైపే ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శనివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ మారుతి ఇన్‌లో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళానికి శ్రీహరిరావు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. నరేందర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పట్టణ అధ్యక్షులు నందెడపు చిన్ను, ఆల్మాస్ ఖాన్, దశరథ్ నిఖిల్, అర్షద్, సాయిప్రతాప్ నాయుడు, సజ్జత్, నవీద్ తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు రోజుల తరబడి యూరియా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు, ఫర్టిలైజర్ షాప్‌ల యా జమాన్యాలు కుమ్మక్కై కొరతను సృష్టించి బ్లాక్‌లో ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారని వాపోయారు. సమస్య పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఆదిలాబాద్ ఎంపీ నగేశ్



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

లక్ష్మణచాంద: బీజేపీ బలపర్చిన అంజిరెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా, మల్క కొమురయ్యను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. శనివారం లక్ష్మణచాందలోని సహకార జూనియర్ కళాశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు గాండ్ల చిన్నయ్య, అడ్వాల రమేశ్, రాంరెడ్డి, లక్ష్మణ్, రంజిత్, మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంతోపాటు న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పల్లి, సంగంపేట, కడ్తాల్, సాకెర గ్రామాల్లో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, సాగర్, నరేశ్, నర్సారెడ్డి, నాగయ్య, సాయినాథ్, సుధాకర్ రెడ్డి, భీంరావు, మక్కన్న, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలకేంద్రంలో శనివారం బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ నగేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, చందు, బాపురెడ్డి, రాజారెడ్డి, రంజిత్, సురేందర్, నరేందర్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి కొమరయ్యను గెలిపించాలి

నిర్మల్‌టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బహుజన నేత, బీసీ బిడ్డ మల్క కొమరయ్యను గెలిపించాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీజేపీ బీసీ బిడ్డకు టికెట్ ఇచ్చి ప్రాధాన్యత కల్పించిందని.. మనం ఓటు వేసి బాధ్యత నెరవేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో టీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ యాదవ్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బడా సాబ్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

- నిరుద్యోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

లక్ష్మణచాంద: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. శనివారం మండల కేంద్రంలో పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో శనివారం విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, రాజనర్సింహారెడ్డి, గడ్డం స్వామి, రామ్‌రెడ్డి, అమృత్‌రాజ్, లింగన్న, మేక ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దయానంద్, చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, స్వప్నిల్‌రెడ్డి, మజీద్, గంగనర్సయ్య, జహీర్ అహ్మద్, గంగాధర్, రాజన్న, సత్యనారాయణ, లక్ష్మీపతిగౌడ్, షౌకత్‌పాషా, నయిం తదితరులున్నారు.

కుభీర్: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జావెద్‌ఖాన్, రాథోడ్ లవకుశ్, వెన్నెల సతీశ్ తదితరులు ఉన్నారు.

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉద్యోగాల భర్తీ సాధ్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కడెంలో పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు దుర్గభవాని, నాయకులు సతీశ్‌రెడ్డి, రమేశ్, వాజీద్‌ఖాన్, రమేశ్ రావు, భూషణ్, శ్రీనివాస్, లచ్చన్న, బొడ్డు గంగన్న, రహీం,రాజు, లక్ష్మణ్, సలీం పాల్గొన్నారు.

మామడ: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొన్కల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, లింగారెడ్డి, రఫి, బాపయ్య, శ్రీనివాస్, వకీల్, లింగన్న, శేఖర్, నర్సారెడ్డి, సుదర్శన్ ఉన్నారు.

కడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం సారంగపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, కోల శ్రీనివాస్, కుమ్మరి రమేశ్, నర్సయ్య, నాగరాజు, లక్ష్మణ్, భీమలింగు తదితరులున్నారు.

సత్తనపల్లిలో చండీ హోమం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో శ్రీ జగదాంబదేవి సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం చండీ సప్తసతి హోమం ఘనంగా నిర్వహించారు. పండితులు పిసుపాటి రేవంత్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, ధాన్యాధి వాసహోమాలు, ప్రతిష్ఠాంగ హోమాలు, రుద్రహోమాలు, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాది వాసములు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అంతకముందు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కడెం టు ప్రయాగ్‌రాజ్

- కుంభమేళాకు బైక్‌పై బయలుదేరిన ఉద్యోగి



బైక్‌పై వెళ్తున్న కిషన్‌సింగ్

కడెం: మండలకేంద్రానికి చెందిన కిషన్‌సింగ్ మహాకుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించేందుకు శుక్రవారం బైక్‌పై ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరాడు. కడెం ఇరిగేషన్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న కిషన్‌సింగ్ గతంలో బైక్‌పై నాందేడ్, భద్రాచలం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి వచ్చాడు. అనంతరం కాశీ, అయోధ్య సైతం వెళ్తానని కిషన్‌సింగ్ పేర్కొన్నాడు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న పండితుడు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివపర్వాతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. కల్యాణం తిలకించేందుకు మండలంలోని బాబాపూర్, నర్సాపూర్, వడ్యాల్, రాచాపూర్, పొట్టపెల్లి, కనకాపూర్, బోరిగాం, న్యూకంజర్, లక్ష్మణచాంద గ్రామాల భక్తులు తరలివచ్చారు.

కొనసాగుతున్న మహోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో భక్తాంజనేయస్వామి నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వం నాలుగో రోజుకు చేరింది. శనివా రం మండప పూజ, వేద పారాయణం, హవనం, సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, హోమం తదితర పూజాది కార్యక్రమాలను సురేష్‌శర్మ జరిపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు

నిర్మల్‌టౌన్: ఓ వ్యక్తిపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని సోఫీనగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి ఒకరు డీజే ఏర్పాటు చేయడంతో నిద్రకు ఆటంకం కలుగుతుందని కాలనీకి చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈవిషయంపై శనివారం ఉదయం డీజే ఏర్పాటు చేసిన వ్యక్తి సంబంధీకులు రాజుపై దాడి చేశారు. రాజు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

ముధోల్: మండలకేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శనివారం కవి శ్రీరామ్ నరేశ్ రచించిన వినరా భారతీయ వీరచరిత, శ్రీరెడ్డి బాలాజీ రచించిన వసుధావాణి పుస్తకాలను ఆవిష్కరించారు. తమ సంస్కృతి తెలుసుకున్న దేశం పురోగతి సాధిస్తుందని ప్రిన్సిపాల్ సాయినాథ్ పేర్కొన్నారు.

పాఠశాలలో టీశాట్ తరగతులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులు టీశాట్ ద్వారా ప్రసారమైన సబ్జెక్టుల తరగతులను వీక్షించారు. పాఠశాలలో రెండు టీవీలు ఏర్పాటు చేయగా 129 మంది విద్యార్థులు వీక్షించారు. ఈసందర్భంగా విద్యార్థుల అనుమానాలను నిర్వాహకులు ప్రత్యక్షప్రసారంలో నివృత్తి చేశారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కుంటాల: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం కుంటాల గ్రామ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చిప్ప గజేందర్, గౌరవ అధ్యక్షుడిగా పొట్ట జనార్దన్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా చిప్ప సంజు, బోగ ప్రవీణ్, వర్ధన్, అజయ్, పొట్ట నవీన్, పొట్ట శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

పండుగ ఏర్పాట్లపై సమావేశం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయ ఐదో వార్షికోత్సవం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం గ్రామస్తులు గజ్జలమ్మ ఆలయ ఆవరణలో సమావేశమై త్వరలో నిర్వహించే గావు పండుగ ఏర్పాట్ల గురించి చర్చించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండలకేంద్రంలో మాజీ సర్పంచ్ నర్సింగ్‌రావు సతీమణి చంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సాదుల లింబగిరి బాగోగులు తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీలు గజ్జారాం, అరుణరమణారావు, వెంగళరావు, జి.రమేశ్‌గౌడ్, గజేందర్, శివ, కల్యాణ్ ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వధువు వివాహ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899